క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

కదిరి అర్బన్: మండల పరిధిలోని పట్నం సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని పార్టీ మండల కన్వీనర్ ప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు అనుబంధ విభాగాల సభ్యులు, వలంటీర్లు, అధికారులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రేపు నల్లచెరువులో..

నల్లచెరువు: నల్లచెరువు, కమ్మవారిపల్లి, పులిమివాండ్లపల్లి, యనమల వారిపల్లి, పాత్రవాండ్లపల్లి గ్రామాల్లో ఈనెల 29న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ పంచ రత్నమ్మ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి హాజరవుతారన్నారు.

ఇంటింటి సర్వే చేపట్టిన వైద్య సిబ్బంది



పిల్లలకు ఐరన్ మాత్రలు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ముదిగుబ్బ: మండల పరిధిలోని దొరిగిల్లు గ్రామంలోని 1వ వార్డులో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా జ్వర పీడితులను గుర్తించి రక్త నమూనాలను సేకరించారు. అదే విధంగా లార్వా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సీహెచ్‌ఓ భారతి, హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, చక్రి, ఆశా కార్యకర్త ఉమా తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ స్టాటిస్టిక్స్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి, అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల అధ్యాపకురాలు పుష్పావతి రచించిన బిజినెస్ స్టాటిస్టిక్స్-1 పుస్తకాన్ని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీకాం జనరల్, బీఏ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు పుస్తకం ఉపయోగపడుతుందని తెలిపారు. రచయిత్రి మా కళాశాలలో ఉపన్యాసకులుగా పని చేయడం హర్షణీయమని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు చిట్టెమ్మ, షమీవుల్లా, కిరణ్‌కుమార్, శివప్రసాద్, భువనేశ్వరి, వెంకటలక్ష్మి, తాహిర్ అలి, స్వామి, రామ్మోహన్, గౌతమి, ఆనంద్ పాల్గొన్నారు.

క్రిష్ణయ్యను కలసిన బత్తల హరిప్రసాద్



ఆర్.క్రిష్ణయ్యతో చర్చిస్తున్న డా.బత్తల హరిప్రసాద్, వెంకటరమణ

కదిరి అర్బన్: ఢిల్లీలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్యను గురువారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డా.బత్తల వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలపై చర్చించారు.

ఘనంగా గ్రామసిరి 13వ వార్షిక మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న సంస్థ సీఈఓ తిరుమలా దేవి

రామగిరి: మండల కేంద్రంలో టింబక్టు కలెక్టివ్ సహకారంతో గురువారం గ్రామసిరి 13వ వార్షిక మహాసభ ఘనంగా నిర్వహించారు. సంస్థ సీఈఓ తిరుమలాదేవితోపాటు సొసైటీ అధ్యక్షుడు సంగప్ప, ప్రోగ్రాం మేనేజర్లు రమేష్‌కుమార్, మహేష్, సుకన్య, శ్రీకాంత్‌లు మాట్లాడుతూ సంస్థ రామగిరితోపాటు చెన్నే కొత్తపల్లి, రొద్దం మండలాలలో విస్తరించి గ్రామసిరి ద్వారా భూమిలేని పేద కూలీలకు జీవాల సంరక్షణ చేపట్టిందన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మాట ఇస్తే వెనక్కి తగ్గేదేలే..

- హామీ మేరకు చెరువుమరవపల్లి బ్రిడ్జి నిర్మించాం
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

తలుపుల: గతంలో చెరువుమరవపల్లి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశాకే మీ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపడతానని చెప్పాను. హామీలో భాగంగా బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యాకే మీ గడప వద్దకు వచ్చాను అని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి అన్నారు. ఏదైనా హామీ ఇస్తే నెరవేర్చేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. గురువారం మండలంలోని ఈదులకుంట్లపల్లి సచివాలయ పరిధిలోని కొవ్వూరివాండ్లపల్లి, చెరువుమరవపల్లి, రాచేపల్లి, భూపతివారిపల్లి, చంద్రానాయక్ తండాల్లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి, సర్పంచ్ కుమారిబాయి, మధుసూదన్‌రెడ్డి, దేవేంద్రనాయక్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ''తాతల కాలం నాటి నుంచి సరైన రోడ్డు, చెరువుమరవపల్లి వంకకు బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఎంతమంది నాయకుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఎవరూ కూడా స్పందించిన దాఖలాలు లేవు. మా గోడు పట్టించు కోలేదు. అయితే మీరు ఇచ్చిన మాట ప్రకారం బ్రిడ్జి నిర్మించడం సంతోషంగా ఉంది.'' అని గ్రామస్తులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ప్రవేశపెట్టనన్ని సంక్షేమ పథకాలను సీఎం జగన్ ప్రవేశపెట్టారన్నారు. ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కొవ్వూరివాండ్లపల్లిలో తాగునీటి సమస్య ఉందని పలువురు విన్నవించారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. అసైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇప్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే.. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫీనాయక్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ సింగల్‌విండో అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, మాజీ సర్పంచులు పురుషోత్తం రెడ్డి, ఫయాజ్ అహమ్మద్ సేవాదళ్ జోన్ ఇన్‌చార్జ్ డీకే బాబు, లోకనాథరెడ్డి, సుబ్బారెడ్డి, నరసారెడ్డి, రవి, బాబురెడ్డి, కొండారెడ్డి, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మొహర్రం సందడి



జీనులకుంటలో కొలువుదీరిన పీర్లు



సిద్దయ్య గుట్టలో పీర్లస్వాములను ఊరేగిస్తున్న దృశ్యం

గాండ్లపెంట: మండల కేంద్రంతో పాటు జీనులకుంట, తూపల్లి, కటకంవారిపల్లి, తుమ్మలబైలు, కటారుపల్లి తదితర గ్రామాల్లోని పీర్లచావిడిలో పెద్ద మౌలాలి, చిన్న మౌలాలీ, ఊరుసుపీరు, గుండెం పీర్లు కొలువుదీరాయి. ఈనెల 29న పెద్ద సరిగెత్తు, 30న జల్దీ కార్యక్రమాలు నిర్వహిస్తామని ముజావర్లు ముజాహిద్దీన్, అర్షద్ తెలిపారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలో మొహర్రం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పలు వార్డుల్లో పీర్లస్వాములను కొలువుదీర్చి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. సిద్దయ్యగుట్టలో గురువారం చిన్న సరిగెత్తు నిర్వహించారు. పీర్లస్వాములు ఇమామి ఖాసీం, బాబా ఫక్రుద్దీన్, అంగారువలి స్వాములను ప్రత్యేక పూలు, వస్త్రాలతో అలంకరించారు. కమిటీ సభ్యులు నూర్, బాబావలి, అఖి, దాదు, షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దిగితే ఉపేక్షించం



గ్రామస్తులను హెచ్చరిస్తున్న ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష

బత్తలపల్లి: మొహర్రం వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష సూచించారు. గురువారం రాత్రి మండంలోని గంటాపురం, పోట్లమర్రి, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు, లింగారెడ్డిపల్లి, సంజీవపురం, యర్రాయపల్లి, వెంకటగారిపల్లి, మాల్యవంతం, అనంత సాగరం గ్రామాల్లో పోలీసులు పర్యటించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మద్యం తాగి గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ చిన్న గొడవ జరిగినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గొడవలకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం, శనివారం జరిగే పెద్ద సరిగెత్తు, జలిధి కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో మద్యం అమ్మకాలు జరిగితే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి



ఇనగలూరులో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అమడగూరు: ఓడీచెరువు మండలంలోని ఇనగలూరు, సున్నంపల్లి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యటించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం గ్రామ వీధుల గుండా తిరుగుతూ అక్క, చెల్లెమ్మలను ఆప్యాయంగా పలకరించారు. కొత్తగా ఇల్లు కావాలంటే సచివాలయానికి నేరుగా వెళ్లి దరఖాస్తు చేసుకోండి అంటూ సూచించారు. పలువురు గ్రామస్తులు కొత్తగా ఇంటిని మంజూరు చేయాలని సంబంధిత పత్రాలను ఇవ్వగా వెంటనే ఇళ్లను మంజూరు చేయించారు. నిర్మాణాలు పూర్తవగానే వెంటనే బిల్లులను మంజూరు చేయాలని హౌసింగ్ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిశీలకులు భాస్కర్‌రెడ్డి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కన్వీనర్ రాజునాయుడు, అగ్రీబోర్డు చైర్మన్ లక్ష్మీరెడ్డి, సర్పంచ్ బాబు, ఎంపీటీసీ గంగులప్ప, హరినాథరెడ్డి, అశ్వర్థరెడ్డి, వెంకటరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయండి



ఎంసీపల్లిలో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అధికారులు



అమడగూరు: ఓటరు కార్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరెడ్డి

రామగిరి: తప్పుల్లేకుండా ఓటరు జాబితాను తయారు చేయాలని తహసీల్దార్ నారాయణ స్వామి తెలిపారు. గురువారం మండలంలోని ఎంసీపల్లి గ్రామంలో ఇంటింటా చేస్తున్న ఓటరు జాబితా సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త ఓటరు జాబితాలతో వచ్చేనెల 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించి సర్వే చేయాలన్నారు. ఓటర్ల పేర్లు, ఆధార్ నంబర్లు, ఇంటిపేర్లు తదితర వివరాలు జాబితాలో సక్రమంగా ఉన్నాయో లేదో చూడాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు: ఓటరు జాబితాలో తప్పులుంటే వెంటనే సరి చేసుకోవాలని తహసీల్దార్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని 212, 229, 230 పోలింగ్ కేంద్రాల పరిధిలోని గృహాలను సందర్శించారు. ఓటరు కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటరు కార్డులో ఏదేని తప్పులున్నా, డబుల్ ఎంట్రీలు ఉన్నా ఆగస్టు 21వ తేదీలోగా సరి చేసుకోవాలన్నారు. అలాగే డిసెంబర్ 31కి పూర్తిగా 18 సంవత్సరాలు నిండితే కొత్త ఓటరు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగిలిన వివరాలకు సంబంధిత బీఎల్‌ఓలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ఈశ్వరయ్య, మండల బూత్ లెవెల్ కన్వీనర్ నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐచర్‌ను ఢీకొన్న ట్రక్కు

పెనుకొండ రూరల్: బెంగళూరు వైపు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కొరియర్ పార్శిల్ సర్వీస్ ట్రక్కు హరిపురం సమీపంలో ఆగి ఉన్న ఐచర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన పెనుకొండ 44వ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. అనంతపురంలోని రుద్రంపేటకు చెందిన డ్రైవర్ గాయపడ్డాడు. స్థానికులు అతడ్ని 108లో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మిస్సింగ్ కేసు నమోదు

కదిరి అర్బన్: తన భార్య శోభారాణి గురువారం ఉదయం నుంచి కనిపించడం లేదని ఎరుకులవాండ్ల పల్లికి చెందిన సురేష్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

మానవ అక్రమ రవాణా చట్టంపై అవగాహన

కదిరి టౌన్: పట్టణంలోని రెడ్స్ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి హాజరయ్యారు. మానవ అక్రమ రవాణా చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, న్యాయవాదులు నరసింహులు, జ్ఞానవర్ధన్‌రెడ్డి, రఘునాథ్, కిరణ్, సంస్థ ప్రతి ప్రతినిధి భానుజా, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మామిడి, నేరేడు చెట్ల ధ్వంసం

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లి గ్రామానికి చెందిన గంగోజమ్మ పొలంలో 50 మామిడి, 10 నేరుడు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బాధితురాలు గురువారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మగ్బూల్ బాషా తెలిపారు.

మహాసభలు విజయవంతం చేయాలి

పుట్టపర్తి టౌన్: ఈనెల 29న అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగే గిరిజన సమాఖ్య 3వ మహాసభలు విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో గిరిజన దళితులు, బహుజనులపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఈ వర్గాలు కాపాడుకునేందుకు ఈనెల 29న అన్నమయ్య జిల్లా రాయచోటిలో గిరిజన సమాఖ్య 3వ రాష్ట్ర మహాసభలు 3 రోజుల పాటు జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయక కార్యదర్శి సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, అరుణోదయం విప్లవ గాయని విమలక్క ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. జిల్లా వ్యాప్తంగా గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

చలో విజయవాడ పోస్టర్ల విడుదల

రామగిరి: మండలంలోని పోలేపల్లిలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పోస్టర్లు గురువారం విడుదల చేశారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మహదేవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తరహాలో సాగుకు రైతుకు రూ.10 వేలు ఇవ్వాలన్నారు. పలుడిమాండ్లతో వచ్చేనెల 7న చలో విజయవాడ కార్యక్రమంలో రైతులందరూ పాల్గొనాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న స్త్రీనిధి మేనేజర్ లక్ష్మీకాంత్

అమరాపురం: పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్త్రీనిధి మేనేజర్ నరేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వైకేపీ కార్యాలయంలో వార్షిక ప్రణాళిక తయారీపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లీగల్ కోఆర్డినేటర్ లక్ష్మీకాంత్, ఏపీఎం తిప్పన్న మాట్లాడుతూ స్త్రీనిధి, బ్యాంకులో తీసుకున్న రుణాలను చిన్న చిన్న వ్యాపారాలు, విద్యార్థుల ఉన్నత విద్యకు ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి నెలా అసలు, వడ్డీ సక్రమంగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం నాగరాజు, సీసీలు పాల్గొన్నారు.

అగళి: స్థానిక వైకేపీ కార్యాలయంలో ఏపీఓ సురేష్ ఆధ్వర్యంలో యానిమేటర్లు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు సమావేశం నిర్వహించారు. రికార్డుల నిర్వహణ, రుణాల మంజూరు, రికవరీ, రైతు సంఘాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. సీసీలు, మండల సమాఖ్య అకౌంటెంట్ పాల్గొన్నారు.

సురక్షతో సమస్యలకు సత్వర పరిష్కారం



ఓబుళాపురంలో ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

బత్తలపల్లి: సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ అన్నారు. గురువారం మండలంలోని ఓబుళాపురం సచివాలయ ఆవరణలో సర్పంచ్ బండి సరస్వతి అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకం అందాలంటే మండల, జిల్లా కేంద్రాల్లోని అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో ప్రజల వద్దకే పథకాలు వస్తున్నాయని తెలిపారు. ఇవి కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ ప్రభుత్వంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. అర్హులై ఉండి పథకాలు అందకున్నా తమ దృష్టికి తీసుకువస్తే తప్పనిసరిగా న్యాయం చేస్తామన్నారు. జనన, మరణ, ఆదాయ, కుల తదితర ధ్రువీకరణ పత్రాలు కూడా ఎలాంటి ఖర్చు లేకుండా అందజేస్తామన్నారు. నేటితో మండలంలో జగనన్న సురక్ష సదస్సులు ముగిసినట్లు తెలిపారు. అనంతరం 1,820 రకాల ధ్రువపత్రాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌజన్యకుమారి, సీఎస్‌డీటీ శారద, ఈఓఆర్డీ దివాకర్, ఎంపీటీసీ సభ్యురాలు బండి రాములమ్మ, సచివాలయాల మండల కన్వీనర్ జయరామిరెడ్డి, కార్యదర్శి పద్మావతి, వీఆర్‌ఓ కుళ్లాయప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనారప్ప, నారాయణస్వామి, నాగభూషణ, ఆదినారాయణ, డీలర్ శ్రీనివాసులు, సోమశేఖర్, పెదయ్య, నాగన్న, పెద్దప్ప, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు వరం

రామగిరి: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని తహసీల్దార్ నారాయణస్వామి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎంసీపల్లి-2 సచివాలయంలో అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పథకాలకు అర్హులైఉండి ఇప్పటి వరకు అందకపోతే ఈకార్యక్రమం ద్వారా వా రికి లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మండల అగ్రిబోర్డు చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్ సిద్ధన్న, ఎంపీటీసీ రామ్మోహన్, అధికా రులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

కనగానపల్లి: పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్ తెలిపారు.గురువారం మండలంలోని ముక్తాపురంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అలివేలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, యూత్ కన్వీనర్ అశోక్, నాయకులు నాగముని, గంగుల సుధీర్‌రెడ్డి, స్థానిక సర్పంచులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ముష్టికోవెల గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ గంగావతి తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, వలంటీర్లు సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలన్నారు.



రామగిరి: ఎంసీపల్లిలో ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న అధికారులు



ముక్తాపురంలో ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దుండగులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమారస్వామి

అమడగూరు: మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించిన దుండగులను వెంటనే శిక్షించాలని రాయలసీమ కమ్యూనిటీ పార్టీ (ఆర్‌సీపీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం ఓడీచెరువులో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ నిందితులను శిక్షించకపోవడం దుర్మార్గమన్నారు. నిందితులకు అండగా ఉంటూ బాధిత మహిళల కుటుంబాలకు న్యాయం చేయని కేంద్ర ప్రభుత్వానికి త్వరలోనే బుద్ధి చెప్పే రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి డివిజన్ కార్యదర్శి మున్నా, శశికుమార్, అయేషా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కదిరి అర్బన్: ఎన్‌జీఓ హోంలో గురువారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సమాజంలో విద్వేషం కాకుండా సహోదరత్వాని పాలకులు పెంపొందించాలన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ వారిపై లైంగిక దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

6,642 మందికి పీఎం కిసాన్ సొమ్ము

ఎన్‌పీకుంట: రైతుల అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం కిసాన్ సమృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని బీజేపీ మండల కన్వీనర్ కొసెట్టి రామ్మోహన్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్ తెలిపారు. పీఎం కిసాన్ నిధుల విడుదల సందర్భంగా గురువారం స్థానిక ఆర్బీకేలో వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ సందేశాన్ని వీక్షించారు. మండలంలోని 6,642 మంది రైతుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.2,000 జమ చేశారన్నారు. రైతుల అభివృద్ధి కోసం కిసాన్ సమృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లను సరసమైన ధరలకు అందుబాటులో తెస్తున్నారని తెలిపారు. మండల వ్యాప్తంగా 99 శాతం ఈ-కేవైసీ చేయించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవడానికి కృషి చేసిన ఆర్బీకే సిబ్బందికి అభినందించారు. కార్యక్రమంలో ఏఓ లోకేశ్వరరెడ్డి, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

రాగి పంటలో సస్యరక్షణ పాటించాలి



నీలకంఠాపురంలో రాగి పంటను పరిశీలిస్తున్న ఏరువాక కో-ఆర్డినేటర్ రామసుబ్బయ్య

మడకశిరరూరల్: వర్షాలకు తెగుళ్లు సోకకుండా రాగి పంటలో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని శ్రీ సత్యసాయి జిల్లా ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ రామసుబ్బయ్య, శాస్త్రవేత్త డాక్టర్ రవికిశోర్ తెలిపారు. గురువారం వారు నీలకంఠాపురంలో రాగి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో అధిక తేమశాతం ఉండడంతో పత్తి పంటకు ఆకుమచ్చ, ఆకుముడత, రాగి పంటకు అగ్గి తెగుళ్లు, మొక్కజొన్నకు కత్తెర పురుగు ఆశించిందన్నారు. పత్తి రైతులు ఒక లీటర్ నీటికి కార్బెండజిమ్ ఒక గ్రామం కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు యూరియా వేసుకోవాలని సూచించారు. రాగి, వేరుశనగ పంటల రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని వివరించారు. గుడిబండ మండలం నాచేపల్లిలో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలను అందించామని తెలిపారు. ఏఓలు తిమ్మప్ప, వీరనరేష్, ఆర్బీకే ఇన్‌చార్జ్‌లు నరసింహమూర్తి, దివ్య, రైతులు పాల్గొన్నారు.